## క్లుప్తంగా

### ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఏపీపీఆర్ పెన్షనర్లు



ఎమ్మెల్యే కన్నబాబును కలసిన సంధాని, రమణరావు, బాషా

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ పింఛనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సంధాని, రమణరావు ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వంగా కలిశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను కలసి తమ సంఘానికి భవనం కోసం స్థలం మంజూరు చేయాలని, సంఘ ఉన్నతికి సహకరించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ భారాలపై ప్రజా బ్యాలెట్

కాకినాడ సిటీ: కేంద్రప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఆదివారం కాకినాడ రైతు బజార్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. పలు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని నాయకులు తాటిపాక మధు, దువ్వా శేషుబాబ్జీ, జె.వెంకటేశ్వరరావు, తోకల ప్రసాద్‌లు విమర్శించారు. రానున్న రోజుల్లో స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు రానున్నదని వారన్నారు. వామపక్ష నాయకులు కేశవరపు అప్పలరాజు, శాఖ రామకృష్ణ, భైరవస్వామి తదితరులు పాల్గొని అభిప్రాయ సేకరణ చేపట్టారు.

### చేతుల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



కరపలో హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, ఈఓపీఆర్డీలు

కరప: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్‌డే సందర్భంగా సచివాలయ, పంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, ఏఎన్‌ఎం సాదే ఉషారాణి పాల్గొన్నారు.

### కనీస వేతనం చెల్లించాలి

కరప: రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్‌రూల్స్ పొందుపరచి, కనీసవేతనం రూ 26 వేలు చెల్లించాలని ఆసంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ కె.సుమన్ డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ ఉద్యోగుల భవనంలో ఆదివారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధనకు విజయవాడలో 10వేల మందితో త్వరలో ఏర్పాటుచేయనున్న భారీబహిరంగ సభను విజయవంతం చేయాలని సుమన్ పిలుపునిచ్చారు. సందర్భంగా రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా అల్లంపల్లి రంగభాస్కర్‌ను నియమించారు. పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సంపూర్ణ శక్తికి ఆలంబన భాగవత పఠనం

బోట్‌క్లబ్: సంపూర్ణ శక్తి సృజనకు భాగవత పఠనం ఆలంబనని ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేటలోని వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో ఆదివారం భాగవత ధారావాహికలు ప్రారంభించాయి. ఈ ప్రసంగాలు ఈ నెల 23 జరుగుతాయని ప్రచారసభ సంయుక్త కార్యదర్శి చింతపల్లి సుబ్బారావు తెలిపారు. ప్రచార సభ ఉపాధ్యక్షులు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు గొట్టుముక్కల వేంకట సత్య నరసింహశాస్త్రి, కాకరపర్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో పాల్గొన్న విద్యార్థినులు

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్‌లోని శిల్పారామంలో విద్యార్థులు ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కాకినాడకు చెందిన బాలభవన్ విద్యార్థినులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. విశ్రాంత ఇంజినీర్ లక్ష్మణరెడ్డి, ఏఓ ప్రకాష్, బాలభవన్ పర్యవేక్షకులు శారద తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



గాయత్రి అలంకరణలో బాలాత్రిపురాంబ



కరపలో విల్లంబులు ధరించిన పర్వత వర్ధనీ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో సంతచెరువు కనకదుర్గ అమ్మవారు



కరపలో విశేష అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

# త్రిపురాంబికా నమోస్తుతే..

- వాడవాడలా వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం
- సామూహిక కుంకుమ పూజలు చేసిన భక్తులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు



సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయంలో పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు, ఎమ్మెల్సీ పద్మజ, వీరభద్రారెడ్డి తదితరులు



వలసపాకలలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ రామకృష్ణ తదితరులు



రిజర్వులైన్ అయ్యప్ప ఆలయంలోని కామాక్షి సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



కరపలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బోట్‌క్లబ్: నగరంలో శరన్నవరాత్ర వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు విల్లంబులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పాలెపు ఉమ బృందం ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. పర్ణిక నృత్యాంజలి ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యం, ఈషా ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన, నాట్యభారతి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి. దేవాలయం వీధిలో బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. మాధవనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యనారాయణ అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి లక్ష్మీరాజ్యం, కార్యదర్శి ఎస్వీ సాయిబాబా పాల్గొన్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో రమా సహిత సత్యదేవ మందిరంలో అఖండ దీపారాధన నిర్వహించారు. మందిర పురోహితులు మద్వేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వైభవంగా కనకదుర్గ ప్రతిష్ఠాపన**

స్థానిక సినిమారోడ్డులోని సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సూచన మేరకు జొన్నాడ చినబాబు ఈ ఆలయాన్ని దాతల సహకారంతో రూ.2 కోట్లతో అందంగా నిర్మించారు. ఆలయంలో నిర్వహించిన గణపతి పూజ, మండప పూజలు, కళాన్యాసం, గర్తన్యాసాలు, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. జగన్నాథపురం శివాలయం, సాంబమూర్తినగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా వేగంగా నిర్మాణం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు మల్లిపాముల గణపతి, కర్రి చినబాబు పాల్గొన్నారు.

**కరపలో..**

కరప: మండలంలోని దుర్గాదేవి ఆలయాల్లోను, విష్ణాలయం, శివాలయాల్లో కలశస్థాపనతో శరన్నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. కరప దుర్గాదేవి ఆలయంలో భక్తులు విరాళంగా ఇచ్చిన బంగారు అభరణాలు, వెండి వస్తువులు త్రిశూలం, చక్రం, అభయహస్తంతో అలంకరించారు. నిత్యం కుంకుమ పూజలు నిర్వహిస్తామని కొంపెల్ల చక్రధరరావు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విష్ణాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలోని పర్వత వర్ధినీదేవిని విలపర్తి శ్రీనివాస్ విల్లంబులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లు చేశారు. కరపలోని మార్కెట్ యార్డు వద్ద శ్రీ విజయదుర్గ ఆటో యూనియన్, గ్రామస్తులు, నడకుదురులో జట్టుపనివారు, కరప సుబ్రహ్మణేశ్వర స్వామి వద్ద అమ్మవార్లను నిలిపి పూజలు చేశారు.

### వచ్చిందయ్యా దసరా సందడి

కాకినాడ రూరల్: దసరా వచ్చిందంటే ఊరూ వాడా పండగే. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మికతను పంచే దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉదయం అంకురార్పణ చేసి, వేడుకలు ప్రారంభించారు. నియోజవర్గంలో అమ్మవారి ఆలయాల్లో దసరా వేడుకలు ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వడంతో అమ్మమ్మ, తాతయ్య, బంధువుల ఇళ్లకు వెళ్లారు. గ్రామాలలో భవానీ దీక్షాధారులతో ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సర్పవరం, రమణయ్యపేట, వలసపాకల, తూరంగి తదితర గ్రామాలలో పర్యటించి ఉత్సవాలను ప్రారంభించారు. వలసపాకలలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో దసరా వేడుకల్లో పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు. సమీప మండపంలోని అమ్మవారి విగ్రహాన్ని ఎమ్మెల్యే కన్నబాబు, వలసపాకలకు చెందిన పెంకే వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అమ్మ ఆశీస్సులతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. రాయుడుపాలెంలోని బాల కనక దుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి ఆధ్వర్యంలో, రమణయ్యపేట శ్రీ పీఠంలో నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

## మట్టిలో మాణిక్యం అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కిద్మత్ కమిటీ సభ్యులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించిన ప్రసాద్ తదితరులు

బోట్‌క్లబ్: మట్టిలో మాణిక్యం మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం అని కిద్మత్ కమిటీ అధ్యక్షులు షేక్ చిష్టి అన్నారు. మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలను కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజాట్యాంక్ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కమిటీ కార్యదర్శి హుస్సేన్, సభ్యులు హసన్ షరీఫ్, మన్సూర్, సిద్దిక్ పాల్గొన్నారు.

**నేటి తరానికి స్ఫూర్తి..**

బాలాజీచెరువు: నేటి తరానికి స్ఫూర్తి డాక్టర్ అబ్దుల్ కలాం అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె.కిశోర్, రవి పాల్గొన్నారు. గాంధీనగర్ గ్రంథాలయంలో అలయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

**బోట్‌క్లబ్ వాకర్ల ఆధ్వర్యంలో..**

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం నిర్వహించారు. కలాం చిత్ర పటానికి వాకర్స్ జిల్లా కో ఆర్డినేటరు అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, చంద్రబాబు, సత్యనారాయణ, తదితరులు నివాళులర్పించారు.

**అంతర్జాతీయ కవితా దినోత్సవం**

అలాగే వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని నిర్వహించి ఆధ్యాత్మికవేత్త, కవి డాక్టర్ శిరీషను అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, పార్థసారధి తదితరులు సన్మానించారు.

## ధ్యానంతో ప్రయోజనాలెన్నో

కాకినాడ రూరల్: శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని శిక్షకురాలు తటవర్తి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శ్రీ విశ్వశాంతి పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో రమణయ్యపేట శాంతి ఆశ్రమంలో ధ్యానం, ఆత్మ జ్ఞానంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ సమస్యలకు, బలహీనతలకు, దుఃఖాల నివారణకు ధ్యానం ఒక్కటే శరణ్యమన్నారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వలన మనలో కలిగే ఉద్రిక్తతలను నివారించవచ్చన్నారు. మానసిక ఆందోళన నుంచి విముక్తి కలిగించి ప్రశాంతతను ఇచ్చేది ధ్యానం మాత్రమే అన్నారు. కార్యక్రమానికి అడబాల స్వర్ణ అధ్యక్షత వహించగా వేణు, మల్లిక, లలిత, సుభాషిని, రాధ, కాశీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ కమిషనర్

బోట్‌క్లబ్: ప్రభుత్వ ఆదేశాలు మేరకు జగనన్నకు చెబుదాంలో భాగంగా సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకుచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10.30కి కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఆటోలో అక్రమంగా 140 మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎంవీవీబీ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు వై.జంక్షన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో కాకినాడ మోచీవారి వీధికి చెందిన కండిపిల్లి దుర్గాప్రసాద్, యలమంచిలి మండలం కొప్పాక గ్రామానికి చెందిన దార శ్రీనులను ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ కుమార్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ టి.దయాకరరావు, కె.వీరభద్రరావు, డి.శ్రీనివాసరావు, ఎం.వినయ్ పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి 21వ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీవైఖానస ఆగమ విద్వాన్ శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మొదటిరోజు శ్రీగురుదత్త బ్రాహ్మణ సేవా సమితి ఉత్సవదారులుగా స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, మంగళ ధ్వని, పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన, నీరాజన మంత్రపుష్పములు, ప్రసాద వితరణ జరిగింది.

## ధర్మ పరిరక్షణకే వెంకన్న ప్రచార రథం



జె.రామారావుపేట పమ్మిడివారివీధిలో రథానికి స్వాగతం పలుకున్న భక్తులు

బోట్‌క్లబ్: సనాతన భారతీయ హిందూ ధర్మరక్షణలో భాగంగా సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ప్రచార రథానికి కాకినాడలో భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. స్థానిక జగన్నాథపురం జె.రామారావుపేటలోని పమ్మిడివారి వీధిలో రామాలయం వద్ద ప్రచార రథానికి భక్తులు, మహిళలు, చిన్నారులు కలశాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధి కరుటూరి వేంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రచార రథాన్ని 2015లో కర్ణాటకలోని రాయచూర్‌లో ప్రారంభించినట్లు చెప్పారు. తిరుమల వెళ్లి శ్రీవారి దర్శించుకోలేని వారి కోసం వారి ఇంటి ముంగిటకే స్వామిని తీసుకువెళ్లడం ద్వారా భగవంతుని కరుణ అందరూ పొందాలన్నదే తన ధ్యేయమన్నారు. కాకినాడ భక్తులు కోరిక మేరకు రథాన్ని ఇక్కడి వీధుల్లో ఊరేగిస్తున్నట్టు తెలిపారు.

## చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



చేతుల పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: మెప్మా కార్యాలయంలో చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ సామర్లకోట పర్యటన సందర్భంగా మెప్మా ఆర్పీల పనితీరు అభినందనీయమని అన్నారు. సీఎం జగన్‌తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, మరోసారి ఆయనను గెలిపించుకోవాలని, అలాగే స్థానికుడైన దవులూరి దొరబాబును సైతం ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

**బాల్య వివాహాలను బహిష్కరించాలి..**

ప్రపంచ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెప్మా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ చేతుల శుభ్రత, బాల్య వివాహలపై మహిళలో అవగాహన పెరగాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత అధ్యక్షత వహించగా కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్ర రావు, జట్ల మోహన్, పాగా సురేష్‌కుమార్, పితాని కృష్ణ, ఎస్ సురేష్, కరణం రాజ్‌కుమార్, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, నక్కా జానికిరామయ్య, చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

## అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలుచేయాలి

- రాష్ట్ర దళిత సదస్సులో వక్తల డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఈ చట్టాన్ని నీరుగార్చే 41 సీఆర్‌పీసీ ప్రకారం బెయిల్ ఇవ్వడాన్ని రద్దు చేయాలని రాష్ట్ర దళిత సదస్సు డిమాండ్ చేసింది. ఆదివారం సూర్యకళా మందిరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర దళిత సదస్సులో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాల కేసులను విచారించడానికి అన్ని జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులను, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సీపీఎం నాయకులు దడాల సుబ్బారావు, నాగేశ్వరరావు, కె ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సురేష్‌నగర్, శాస్త్రినగర్‌ల నూతన కార్యవర్గం



సురేష్‌నగర్, శాస్త్రినగర్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ 3వ డివిజన్ పరిధిలోని సురేష్‌నగర్, శాస్త్రినగర్‌లకు నూతన కార్యర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రెండు కాలనీలకు సంబంధించి కాలనీవాసుల సమక్షంలో ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడిగా గొల్లపల్లి వీరవెంకట సత్యనారాయణ(లాయర్ బుజ్జి), ఉపాధ్యక్షుడిగా డీవీవీ రాజు (రవిరాజు), కార్యదర్శిగా నాయుడు, కోశాధికారిగా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా సుబ్బరాజు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడుగా కొప్పం రాజేష్, సభ్యులుగా దివాకర్, శాస్త్రి, శ్రీనురాజు ఎన్నికయ్యారు. ఎన్నిక తరువాత నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. అనంతరం రమణయ్యపేట వైద్యనగర్ చేరుకుని ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలవగా ఆయన వారిని అభినందించారు. కాలనీల వాసులకు అండగా ఉంటామని అధ్యక్ష, ఉపాధ్యాక్షులు లాయరు బుజ్జి, రవిరాజు తెలిపారు.

## పలు గ్రామాల్లో పోలీసు దాడులు



ఇంద్రపాలెం పరిధిలో దాడులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు దేవసుధ, రామకృష్ణ

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం, కరప పోలీసులు ఆదివారం కోడి పందేలు ఆడే ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సైలు దేవసుధా, రామకృష్ణ కొవ్వూరు, రేపూరు, కొవ్వాడ, గంగానాపల్లి గ్రామాల్లో దాడులు చేసి ముందస్తుగా కోడి పందాలకు కత్తెలు కట్టే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం, గంజాయి తాగేవారిపై దాడులు చేసి పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## ఆలోచనల మార్పిడితో మేధోమథనం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కళాశాలలో నిర్వహించే వర్క్‌షాపుల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా పరస్పరం ఆలోచనలు పంచుకోవచ్చని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఐడియల్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మెకోట్రానిక్స్ ఇండస్ట్రియల్ ఆటోమేషిన్ వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుదలతో పాటు జీవితంలో స్థిరపడే మనోధైర్యాన్ని చేకూర్చుకోవడానికి దోహదపడతాయన్నారు. మిత్సుబిషి ఎలక్ట్రిక్, బ్రుందమ్ మెకోట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషిన్‌లో వచ్చిన మార్పులు వివరించారు. పారిశ్రామిక 4.0 ప్రకారం పీఎల్‌సీ డెమో కిట్స్, సర్వోమోటర్స్, ల్యాడర్ ప్రోగ్రామింగ్ అంశాలను ప్రాక్టికల్‌గా విద్యార్థులచే చేయించి కంపెనీలో ఎలా ఉపయోగించాలో వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ అంజిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.